# మన పూర్వీకులకు సంతోషాన్ని కలిగించడం



## దాజీ

పూజ్యశ్రీ లాలాజీ మహరాజ్

153వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఇచ్చిన సందేశం

22, 23 & 24, జనవరి 2026, కాన్హా శాంతి వనం



# మన పూర్వీకులకు సంతోషాన్ని కలిగించడం

ప్రియతములారా!

ప్రతి సంవత్సరం వసంత పంచమి అరుదెంచినప్పుడు, నేను పూర్తిగా వివరించలేనిది ఏదో నా హృదయంలో సంభవిస్తుంది. పసుపు వర్ణ పుష్పాలు, మల్లీ నులివెచ్చదనం సంతరించుకుంటున్న వాతావరణం, వసంత ఋతువు వికసితం కావడం అనేవి ఒక నూతన ఆరంభాన్ని సూచిస్తాయి. అయితే ఈ మార్గంలో నడిచే మనకు, దివ్యజ్యోతి భూమిపై అవతరించేందుకు నిర్ణయించుకున్న సందర్భంగా, ఋతువులకు అతీతమైన మరింత పరిమళాన్ని ఈ రోజు కలిగి ఉంటుంది.

ప్రజలు ఆధ్యాత్మికతను అనుభూతి చెందే ప్రక్రియనే శాశ్వతంగా మార్చివేసిన ఒక విశిష్ట వ్యక్తిత్వం 1873 ఫిబ్రవరి 2న జన్మించింది. ఆ సమయంలో ప్రపంచానికి ఈ సంగతి తెలియదు. ఎలా తెలుస్తుంది? ఉన్నతాత్మలు ఎటువంటి హంగామా లేకుండా నిరాడంబరత అనే ముసుగులో మౌనంగా అవతరిస్తాయి. అయితే ఆ విషయం తెలిసిఉన్న ప్రకృతి, ఆ రోజు ఒక మౌన వాగ్దానాన్ని చేసింది.

ఆ పిల్లవాని మాతృమూర్తి, తన హృదయంలో భక్తిరసం పరవళ్ళు తొక్కే ఒక సాధు స్వభావి. ఒకనాడు ఒక అవధూత భిక్షకై ఆమె ఇంటికి వచ్చాడు. తన ఆహారంలో చేప కావాలని కోరాడు. అయితే ఆమె ఏనాడూ మాంసాహారం తినని, వండని కారణంగా ఆమె వద్ద చేపలు లేవు. కానీ దైవకృప కారణంగా ఆ ఇంటిలో పనిచేసే

ఒక తెలివైన పనిమనిషి వెంటనే పక్కఇంటికి వెళ్లి రెండు వండిన చేపలు తీసుకుని వచ్చింది. ఆ అవధూత వాటితో తన భోజనం ముగించి, "నిన్ను బాధ పెట్టే విషయం ఏమిటమ్మా?" అని ఆమెను అడిగాడు. ఆమె మౌనంగానే ఉన్నప్పటికీ ఆ పనిమనిషి "ఉన్నతమైన హృదయమున్న మా యజమానురాలికి అన్నీ ఉన్నాయి కానీ సంతానం ఒక్కటే లేదు!" అని బదులిచ్చింది.

"ఓహో!" అంటూ ఆ మహాత్ముడు వినీలాకాశం వైపు తీక్షణంగా చూసి కొన్ని నిమిషాల అనంతరం చిరునవ్వుతో ఆకాశంవైపు తన చేతి వేళ్ళు చూపుతూ, "ఒకటి... రెండు... ఒకటి... రెండు..." అని పలికి అక్కడనుండి నిష్క్రమించాడు. ఆ తర్వాత ఆయన ఆ చుట్టుపక్కల మళ్ళీ కనిపించలేదు.

ఆ తర్వాతి సంవత్సరం 1873లో వసంత పంచమి రోజున మొదటి కుమారుడు జన్మించాడు. వారే 'లాలాజీ'గా పిలువబడిన ఫతేఘడ్ కు చెందిన రామచంద్ర.

ఈ విశిష్ట వ్యక్తిత్వాన్ని గురించి ఇప్పటివరకు చెప్పబడని విషయాన్ని నేను మాత్రం ఏం చెప్పగలను? అలాంటి మహాత్ముల గురించి శాస్త్రాలు సూచించాయి, కవులు ప్రయత్నించారు. టెన్నిసన్ వంటి కవి ఈ క్రింది పదాలను వారి కోసమే వ్రాశాడా అనిపిస్తుంది.

> నీవు మానవునిగానూ, దివ్యునిగానూ కనిపిస్తావు!
> అత్యున్నత అతి పవిత్ర మానవత్వం నీవే సుమా!!

కేవలం 7 నెలల కాలంలోనే, యువకునిగా ఉన్నప్పుడే, ఇతరులు అనేక జన్మలలో సైతం సాధించలేని స్థితిని వారు సాధించారు. దివ్యజ్యోతి అనేది ఒక సుదూర లక్ష్యాన్వేషణలా కాక అతి సహజంగా, అంతర్లీనంగా వారిలో ఉదయించింది. ఆయన దానిని అన్వేషించలేదు; ఆయనే దానిగా రూపొందారు.

మానవాళి మరిచిపోయిన ఒక మహత్తరమైన వారసత్వం లాలాజీ ద్వారా పునరుజ్జీవింపబడింది. 'ప్రాణాహుతి' అనబడే ఆ పవిత్ర శాస్త్ర ప్రక్రియ లేదా జీవసారమైన 'ప్రాణస్య ప్రాణః' అని పిలవబడే ప్రసారం అందివ్వబడింది.

అయోధ్యాపతి శ్రీరామచంద్రునికి 73 తరాలకు పూర్వమే పూజ్యశ్రీ ఋషభదేవ్ మహరాజ్ ద్వారా ప్రగాఢమైన ఈ పరిజ్ఞానం తొలుత పరిచయం చేయబడింది. ఈ జీవన మూల సారాన్ని, ఒకరి నుండి మరొకరికి ప్రసారం చేయగలిగే సున్నితమైన విజ్ఞాన ప్రక్రియను ఆయన ఆవిష్కరించారు.

దివ్య ప్రాణాహుతి యొక్క ప్రసారం ద్వారా చైతన్యపు ఉన్నత క్షేత్రాలకు ద్వారాలు తెరుచుకుంటాయి. సంసార జీవితం నుండి సన్యాసంలోకి ఉపసంహరణ ద్వారా కాకుండా, సమన్వయంతో కూడిన జీవన విధానంతోనే సాధకులు బ్రహ్మవిద్యను పొందగలరు. ప్రపంచంలో పరిపూర్ణంగా జీవిస్తూనే, అంతరంగంలో ఆ పరమాత్మతో ఐక్యమై ఉంటూ, ఒక గృహస్థునిగా భౌతిక, ఆధ్యాత్మిక బాధ్యతలను సామరస్యంతో నిర్వహించడం ద్వారా దీన్ని చేరుకోవచ్చు. ఈ సజీవ దివ్య ప్రవాహం, నిష్ఠతో కూడిన దైనందిన సాధన ద్వారా సాధకుడిని అతి తక్కువ సమయంలోనే సమాధి స్థితులకు వేగంగా తీసుకు వెళుతుంది.

అయితే మానవ చరిత్ర పరిణామ క్రమంలో ఈ అమూల్య విజ్ఞానం క్రమంగా మానవ మస్తిష్కం నుండి మసకబారి చివరికి అంతరించిపోయింది. విధి జోక్యం చేసుకునేవరకూ అది నిద్రాణంగా ఉండిపోయింది. అనంతరం లాలాజీ మహారాజ్ ఈ పవిత్ర ప్రవాహాన్ని తిరిగి కనుగొని, పునరుజ్జీవింపజేసి మానవాళి అత్యున్నత స్థితికి నేరుగా చేరుకునేందుకు ఒక సజీవ మార్గాన్ని తిరిగి అందించారు. కేవలం తాత్వికత, బోధనలు మాత్రమే కాక హృదయం నుండి హృదయానికి ఆధ్యాత్మిక సారాన్ని ప్రత్యక్షంగా ప్రసారం చేయడం అనేది మానవాళికి లాలాజీ ఇచ్చిన ఒక బహుమతి.



**దివ్య ప్రాణాహుతి యొక్క ప్రసారం ద్వారా చైతన్యపు ఉన్నత క్షేత్రాలకు ద్వారాలు తెరుచుకుంటాయి. సంసార జీవితం నుండి సన్యాసంలోకి ఉపసంహరణ ద్వారా కాకుండా, సమన్వయంతో కూడిన జీవన విధానంతోనే సాధకులు బ్రహ్మవిద్యను పొందగలరు. ప్రపంచంలో పరిపూర్ణంగా జీవిస్తూనే, అంతరంగంలో ఆ పరమాత్మతో ఐక్యమై ఉంటూ, ఒక గృహస్థునిగా భౌతిక, ఆధ్యాత్మిక బాధ్యతలను సామరస్యంతో నిర్వహించడం ద్వారా దీన్ని చేరుకోవచ్చు.**

తర్వాత ఆ శిష్యుడు వచ్చాడు.

షాజహాన్ పూర్ లోని రామచంద్ర (బాబూజీ) అనే యువకుడు, ఫతేగడ్ లోని మహాత్ముని గురించి విన్నాడు. కేవలం లాలాజీ పేరు వినినంతనే అతని అంతరంగంలో ఏదో స్పందన కలిగింది. అందుకని ఆయనను దర్శించాలనే తపనతో అతను ప్రయాణమయ్యాడు. అలా 3 జూన్ 1922లో తన తొలి దర్శనంలోనే అతని జీవితం శాశ్వతంగా మారిపోయింది.

అనంతరం బాబూజీ ఇలా వ్రాసుకున్నారు, "నేను నా గురువర్యులను మొదటిసారి దర్శించిన సమయంలో ఒక అద్వితీయ మనఃస్థితిని అనుభవించాను. ఆ క్షణంలో నేను పొందిన పారవశ్యపు అనుభూతి మాటల్లో వర్ణించలేనిది. ఆనాటి నుండి నేను కొత్త జీవితాన్ని ప్రారంభించాను. అంతా మారిపోయినట్లు అనిపించింది. ప్రపంచం భిన్నంగా తోచసాగింది."

ఆ విధంగా ఆధ్యాత్మిక చరిత్రలో అన్నిటినీ తోసిరాజనదగ్గ ఒక ప్రేమ కథ ప్రారంభమైంది. నేను ఈ పదాలను తేలికగా ఉపయోగించడం లేదు. ఎందుకంటే లాలాజీకి, వారి శిష్యునికి మధ్య వెలసిన బంధం సాధారణమైన భక్తి కాదు. అది శిష్యునికి గురువు పట్ల కలిగే గౌరవానికి అతీతమైనది. దాన్ని వర్ణించడంలో భాష విఫలమవుతుంది. అది దివ్యాత్మలు సైతం విస్మయంతో అలా నిలిచిపోయేంత గొప్పది.

వారిద్దరి బంధం గురించి బాబూజీ ఒకసారి ఇలా అన్నారు. "మేము ఆధ్యాత్మికంగా ఐక్యమైన హృదయంతో సంపూర్ణ ఏకత్వంలో ఉన్నాము. ప్రియతమునికి మరేదీ ఇంతకన్నా అందంగా అనిపించదు. అలాంటి ప్రేమ, వ్యక్తికి తన పరిమితులకు అతీతంగా, వారిని సంతృప్తి పరిచేందుకు సాధ్యమైన ప్రతిదాన్నీ చేయాలనే ప్రేరణను ఇస్తుంది."

మరోచోట, లాలాజీ లేకుండా తాను ఒక్క క్షణమాత్రమైనా బ్రతకలేనని ఆయన అంగీకరించారు. అప్పటికి కొన్ని దశాబ్దాల క్రితమే మహాసమాధినొందిన భౌతికమైన లాలాజీ గురించి ఆయన ఇక్కడ ప్రస్తావించడం లేదు. ఆయన చెబుతున్నది తన శ్వాసలో శ్వాసగా, ప్రాణంలో ప్రాణంగా, తన జీవితానికే జీవంగా మారిన లాలాజీ గురించి.

**నేను ఈ పదాలను తేలికగా ఉపయోగించడం లేదు. ఎందుకంటే లాలాజీకి, వారి శిష్యునికి మధ్య వెలసిన బంధం సాధారణమైన భక్తి కాదు. అది శిష్యునికి గురువు పట్ల కలిగే గౌరవానికి అతీతమైనది. దాన్ని వర్ణించడంలో భాష విఫలమవుతుంది. అది దివ్యాత్మలు సైతం విస్మయంతో అలా నిలిచిపోయేంత గొప్పది.**

చదివిన ప్రతిసారీ నాకు కన్నీళ్లు తెప్పించే ఒక విషయాన్ని మీతో పంచుకుంటాను.

బాబూజీ గురించి లాలాజీ చేసిన ప్రకటనలోని ఒక వ్యాఖ్య మనల్ని ఆశ్చర్యంతో, మౌనంగా నిలిచిపోయేలా చేస్తుంది. బాబూజీ తన భార్యతో గడిపే ఆ అత్యంత పవిత్ర క్షణాలలో సైతం, హృదయంలో తన మాస్టర్ ని లిప్తకాలంపాటు కూడా వీడకపోవడాన్ని లాలాజీ గమనించారు. ఆయన ప్రాపంచిక జీవితంలోని ప్రతి పరిస్థితిలోనూ వారిద్దరి అనుబంధం నిరంతరాయంగా అలా కొనసాగుతూనే ఉండేది.

ఇదే కదా, బ్రహ్మచర్యానికి అసలైన అర్థం! ప్రాపంచిక జీవితం లేకపోవడం కాదు; ఆ జీవితంలోనే నిరంతర స్మరణను కలిగి ఉండడం. తన శరీరం ప్రపంచంతో వ్యవహరిస్తున్నప్పటికీ బాబూజీ దృష్టి నిరంతరం ఆ పరమోన్నత స్థితిపైనే నిలిచి ఉండేది.

ఏ ప్రేమ అటువంటి స్మరణను నిలుపుకోగలదు? ఏ భక్తి అలాంటి స్మరణను స్థిరీకరింపజేసుకోగలదు?

ఇప్పుడు నేను మీకొక అసాధారణమైన విషయాన్ని చెబుతాను.

1945 మార్చి 21న నమోదు చేయబడిన 'విస్పర్స్ ఫ్రం ది బ్రైటర్ వరల్డ్' లోని ఒక ఆంతరిక సంభాషణలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన విషయం ఒకటి ఉంది. ఆధ్యాత్మిక సింహంగా కొనియాడబడే స్వామి వివేకానంద, లాలాజీకి బాబూజీపై ఉన్న ప్రేమ గురించి మొదట మాట్లాడారు. అనంతరం శ్రీకృష్ణుడు, బాబూజీకి లాలాజీపై ఉన్న ప్రేమ గురించి చెప్పారు.

స్వామి వివేకానంద ఇలా అన్నారు, "మన ప్రభువు (లాలాజీ) నీపై తనకు గల ప్రేమ గురించి చెప్పినదంతా నగ్నసత్యం. ఆయన నీపై తనకు గల ప్రేమతో దహించుకుపోతున్నారు. నా జీవితపర్యంతమూ నేను వేరెక్కడా ఇలాంటి ఉదాహరణ చూడలేదు." ఇంకా ఆయన ఇలా అన్నారు, "ప్రజలు భగవంతుని కోసం తమ గృహాలను వదిలివేస్తారు. కానీ ఆయన నీకోసం తన గృహాన్ని వదిలేశారు. ఒక విముక్తాత్మ నుండి ఆశించగలిగే అత్యున్నత త్యాగం అది." అప్పుడు లాలాజీ అడ్డుపడి ఆ సంభాషణని తన డైరీలో నమోదు చేయవద్దని బాబూజీని కోరడం జరిగింది.

విముక్తి చెందిన ఆ గురువర్యులు లాలాజీ, తన దివ్య నివాసాన్ని, తనదైన భండారాను తన శిష్యుడైన బాబూజీ కోసం వదిలి వచ్చారు. శిష్యుని కోసం క్రిందికి గురువు దిగి వచ్చారు... భూమి వైపు ఆకాశం వంగింది.

పిమ్మట శ్రీకృష్ణుడు ఇలా అంటారు. ఇప్పుడు ఆ మాటలు వ్రాస్తున్నప్పుడు కూడా నా చేతులు వణుకుతున్నాయి. "స్వామి వివేకానంద చెప్పిన విషయం అక్షరాలా నిజం. ప్రేమ విషయంలో నీవు రాధను సైతం మించిపోయావని వ్రాయడంలో ఎలాంటి దోషమూ లేదు. రాధ ప్రేమ ఇప్పుడు నీ ప్రేమకు తర్వాతే!"

ఇది ఏం సూచిస్తున్నదో మీకు అర్థమవుతోందా? కొన్నివేల సంవత్సరాలుగా శ్రీకృష్ణునిపై రాధకు గల ప్రేమ, అత్యున్నత భక్తికి ఒక ఉదాహరణగా కొనియాడబడుతోంది. రాధ అనే పేరు దివ్య ప్రేమకు పర్యాయపదంగా మారినప్పటికీ, లాలాజీ పట్ల బాబూజీకి గల ప్రేమ, రాధ ప్రేమ కన్నా మిన్న అని శ్రీకృష్ణుడు ప్రకటిస్తున్నారు.

అయితే ఈ కథ అక్కడితో ముగియలేదు. మూడు రోజుల తర్వాత, సృష్టి ఆది నుండి ఎప్పుడూ జరగని ఒక అపూర్వ పతాక సన్నివేశానికి అది చేరుకుంది.

1945 మార్చి 24 శుభ దినాన స్వయంగా ఆ పరతత్వమే బాబూజీకి దీక్షనొసగేలా లాలాజీ ఏర్పాటు చేశారు. దీన్ని స్వయంగా వీక్షించిన శ్రీకృష్ణ పరమాత్మ ఇలా ప్రకటించారు, "నీ పూజ్య గురుదేవులు నేరుగా ఆ పరతత్వంనుండే నీకు దీక్షను ఇప్పించడం జరిగిన నేడెంతో శుభదినం. ఇదే అసలైన దీక్షగా పిలవబడుతుంది. ఈ విధంగా జరగడం సృష్టి ప్రారంభం నుండి ఇదే తొలిసారి."

స్వామి వివేకానంద ఇంకా ఇలా అన్నారు. "పరతత్వం నుండి నేరుగా నీవు దీక్ష పొందావనే వార్త తెలిసి, నేను ఎంతో ఆనందించాను. ఈ ప్రపంచం యొక్క ఆవిర్భావం నుండి జరిగిన తొలి ఉదాహరణగా ఇది నిలిచిపోతుంది."

ఇక్కడ ఒక క్షణంపాటు ఆగి, నా హృదయాన్ని ఆశ్చర్యంతో వేదనకు గురి చేసిన ఒక విషయాన్ని గమనించండి.

ఆ ఉన్నతోన్నత సంఘటన అనంతరం తన నిస్వార్థపు లోతులను వెల్లడించే ఒక మౌన ప్రకటనను లాలాజీ చేశారు. ఆయనిలా అన్నారు, "నేరుగా (ప్రత్యక్ష) దీక్ష అనేది పూర్తిగా నా పద్ధతి. ఇంతకు ముందు ఇది ఎవరి అవగాహనకూ రాలేదు; అలాగే ఇది ఆచరణలోనూ లేదు."

దీని అర్థం మీరు గ్రహించగలిగారా? అది ఆయనే స్వయంగా కనుగొన్నారు కాబట్టి, లాలాజీకి ఆ పద్ధతి ఏమిటో తెలుసు. తన జీవితకాలంలోనే, తనకన్నా ముందు ఏ ఆత్మా గ్రహించని విధానమైన పరతత్వంచేతే నేరుగా దీక్ష పొందడానికి వీలయ్యే విధానాన్ని ఆయన గ్రహించగలిగారు. తనకోసం దాన్ని వాడుకోవచ్చు గానీ ఆయన అలా చేయలేదు. ఆ పరమ రహస్యాన్ని తనలోనే దాచుకొని తన ప్రియశిష్యుడు ఆ బహుమతిని అందుకునే స్థితికి చేరే సమయం వరకు వేచి ఉన్నారు. ఎప్పుడైతే బాబూజీ అలాంటి ఉన్నత స్థితికి చేరుకున్నారో అప్పుడు లాలాజీ, తన శిష్యుడి కోసం ఆ పద్ధతిని ఉపయోగించారు.

గురువు తాను ఎన్నడూ పొందనిదాన్ని అందివ్వడంలో, శిష్యుడిని తనకన్నా ముందు ఉంచారు. అలాంటి ప్రేమ ఎలాంటి తర్కానికీ అందదు. బహుశా అది తమ పిల్లలకై



**ఆ ఉన్నతోన్నత సంఘటన అనంతరం తన నిస్వార్థపు లోతులను వెల్లడించే ఒక మౌన ప్రకటనను లాలాజీ చేశారు. ఆయనిలా అన్నారు, "నేరుగా (ప్రత్యక్ష) దీక్ష అనేది పూర్తిగా నా పద్ధతి. ఇంతకు ముందు ఇది ఎవరి అవగాహనకూ రాలేదు; అలాగే ఇది ఆచరణలోనూ లేదు."**

త్యాగం చేసే తల్లిదండ్రులనీ, ప్రియురాలి కోసం సర్వస్వమూ అర్పించే ప్రేమికుని కూడా మించి ఉంటుంది. ఇక్కడ గురువు ఒక అత్యున్నత ఆధ్యాత్మిక బహుమతిని కనుగొని, దానిని తన శిష్యునికి అందించారు. తాను వెనుక నిలిచిపోవడంలోనే వారు సంతృప్తిని పొందారు. తాను స్వయంగా అధిరోహించని సోపానాలను తన శిష్యుడు అధిరోహించడం చూసి వారు తృప్తి చెందారు.

అటువంటి అత్యున్నత బహుమతిని అందించిన పిదప లాలాజీ తన గురించి చెబుతూ ఒక పార్సీ ద్విపదను ఉటంకించారు, "వేలాది బానిసలకు ప్రభువైన మహమూద్ ఘజ్నవీ అనే రాజు పేదరికంతో సర్వం కోల్పోయి చివరికి ఒక బానిసకు బానిసగా మారిపోయాడు." అనంతరం లాలాజీ నిరాడంబరంగా "ఇదీ నా స్థితి!" అని అన్నారు.

గురువులకే గురువైన ఆ పరమ గురువు, ఏనాడో కోల్పోయిన ప్రాణాహుతిని తిరిగి పొందగలిగిన ఆ విశిష్ట వ్యక్తిత్వం, ఎవరి ద్వారానైతే మానవాళి అంతటికీ ఆ ప్రాణాహుతి ప్రవహిస్తుందో అటువంటి లాలాజీ, శిష్యునికి తనకన్నా గొప్పదైన కానుకను అందించి తనను తాను దాసానుదాసునిగా అభివర్ణించుకున్నారు.

తాను పొందగలిగిన అత్యున్నత ఫలాన్ని సైతం తన శిష్యుడు ముందుగా ఆస్వాదించగలందులకు, తనను తాను కట్టడి చేసుకున్న ఒక గురువర్యుల పరమోన్నత ప్రేమకు, ఇక్కడ మనం సాక్షీభూతమవుతున్నాం. వారి హృదయం అంత విశాలమైనది కాబట్టే సృష్టిలోని అతి గొప్ప రహస్యాన్ని కనుగొన్నప్పటికీ, దానిని మరొకరికి కానుకగా అందించారు. అయితే దాన్ని త్యాగం అని పిలవడం ఒక అసలైన మాస్టర్ హృదయాన్ని అపార్థం చేసుకోవడమే! ఎందుకంటే ఆ బహుమతిని శిష్యునికి అందజేయడం లాలాజీకి అపారమైన ఆనందాన్నిచ్చింది.

నిజానికి ఒక గురువు అనుభూతి చెందగల అత్యున్నత ఆనందం – తన శిష్యుడు తనను అధిగమించడాన్ని చూడడం, తనకు ప్రియమైనవాని అభివృద్ధిని గమనించడం, తన సమస్తమూ ఇచ్చివేసి దానికి ప్రతిగా నిండైన తృప్తిని అనుభూతి చెందడం. తల్లి తన శిశువుకు ఆహారం తినిపించినపుడు ఆమె త్యాగం చేయదు. అలాగే నది, సముద్రంలో కలిసినప్పుడు దానిని త్యాగం అనరు. బాబూజీని పరతత్వం నుండి

నేరుగా దీక్ష తీసుకున్న తొలి వ్యక్తిగా నిలపడమనేది లాలాజీకి ఒక పరిపూర్ణత, ఒక పరమానంద కారణం, రెండూనూ.

**నిజానికి ఒక గురువు అనుభూతి చెందగల అత్యున్నత ఆనందం – తన శిష్యుడు తనను అధిగమించడాన్ని చూడడం, తనకు ప్రియమైనవాని అభివృద్ధిని గమనించడం, తన సమస్తమూ ఇచ్చివేసి దానికి ప్రతిగా నిండైన తృప్తిని అనుభూతి చెందడం.**

ప్రేమంటే ఇదే. మార్గం అంటే ఇదే. వసంత పంచమి శుభదినాన మనం వేడుకగా జరుపుకునేది దీనినే!

ప్రస్తుతం నడుస్తున్న యుగం గురించి ఒకసారి లాలాజీ ఇలా అన్నారు: “ఇలాంటి సమయం మళ్లీ ఎంతోకాలానికి గాని తిరిగి రాదు. ప్రత్యేకమైన ఈ సమయానికి ఈ సామెత వర్తిస్తుంది: మజ్నూ అడవిని తన ఇంటిగా చేసుకున్నాడు. అయితే నేను నా ఇంటినే అడవిగా మార్చుకున్నాను.” ఆ ప్రఖ్యాత ప్రేమికుడైన మజ్నూ తాను నివసిస్తున్న నగరాన్ని వదిలేసి ప్రేమలో పిచ్చివాడై అడవుల్లో సంచరించాడు. అయితే గురుదేవులు లాలాజీ, శిష్యునిపై తపనతో, ప్రేమతో, తన అమరలోక నివాసాన్నే అడవిలా మార్చుకున్నారు.

శ్రీకృష్ణపరమాత్మ, బాబూజీ యొక్క యోగ్యతాస్థాయిని ‘అనుత్తర’, అంటే ఒక అత్యున్నత స్థాయికి చెందినదిగా అభివర్ణించారు. “అలాంటి యోగ్యతాస్థాయి కొన్నిసార్లు ఎన్నో సంవత్సరాల, శతాబ్దాల, చెప్పాలంటే సహస్రాబ్దాల అనంతరం హఠాత్తుగా జనిస్తుంది. దీనికి సాటి లేదు. అటువంటి అర్హత గల వ్యక్తి భగవంతుని ఆదేశానుసారమే జన్మిస్తాడు. దానికి నీవే ఒక ఉదాహరణ.” అని ఆయన అన్నారు.

1931లో లాలాజీ తన భౌతిక దేహాన్ని పరిత్యజించిన సమయంలో బాబూజీ ఇలా వ్రాశారు. “నిజం చెప్పాలంటే నా మాస్టర్ మరణించలేదు. నేనే మరణించినట్లు అనిపించింది.” తర్వాత ఎన్నో సంవత్సరాల పాటు ఆయన డైరీ మూగబోయింది.

లాలాజీ జీవించి ఉన్న సమయంలో విస్తృతంగా నమోదు చేసిన ఆ ప్రియ శిష్యుడు ఒక నిశ్శబ్ద నీరవంలోనికి జారిపోయాడు. ఆ అంధకారంనుండే ఏదో మొలకెత్తాల్సి ఉంది.

మళ్లీ 1944లో వారిద్దరి మధ్య అంతరంగ సంభాషణ పునఃస్థాపితమైంది. భౌతిక మరణంతో ముగిసిపోయినట్లు అనిపించిన ఆ సంబంధం, కేవలం రూపాన్ని మార్చుకుంది. లాలాజీ తన మార్గదర్శనాన్ని, ప్రాణాహుతి ప్రసరణను, ప్రేమను అందివ్వడాన్ని కొనసాగించారు. వారి బంధం మరణాన్ని అధిగమించింది; వారి ప్రేమ దేహాన్ని అధిగమించింది; ప్రాణాహుతి ప్రసారం ఇప్పటికీ కొనసాగుతోంది.

వసంత పంచమి రోజున నేను ఇదంతా ఎందుకు మీతో పంచుకుంటున్నాను? ఎందుకంటే మీకు అందుబాటులోకి వచ్చిఉన్న దాన్ని గురించి మీరు అర్థం చేసుకోగలుగుతారు కాబట్టి.

ధ్యానానికి కూర్చున్నప్పుడు మీ హృదయంలో ఒక సున్నితమైన స్పందనను మీరు అనుభూతి చెందినప్పుడు, లాలాజీ – బాబూజీల మధ్య ప్రవహించబడిన అదే ప్రవాహాన్ని మీరు స్పృశిస్తున్నారు. మీరు ప్రాణాహుతిని అందుకున్నప్పుడు ఎన్నో తరాలపాటు కోల్పోబడి, మానవాళికై పునరుద్ధరింపబడిన ఆ బహుమతిని స్వీకరిస్తున్నారు. దేనికోసమో వర్ణించనలవి గాని ఒక తపన మీలో కలిగినప్పుడు రాధ ప్రేమను సైతం మించిన ప్రేమ యొక్క ప్రతిధ్వనినే మీరు అనుభూతి చెందుతున్నారు.

ఇదీ మన వారసత్వం, మన జన్మ హక్కు; 1873లో వసంత పంచమి రోజున జన్మించిన ఒక పిల్లవాడు అనంతరకాలంలో ఒక మాస్టర్ లా తయారైనందువల్ల, సృష్టి ప్రారంభం నుండి ఎన్నడూ లేనంతగా ఒక శిష్యుడు ఆ మాస్టర్ ను అపూర్వంగా ప్రేమించడం వలన ఇది మనకు అందుబాటులోకి వచ్చింది.

వసంతకాలంలో పుష్పాలు వికసిస్తాయి; ప్రపంచం తనను తాను పునరుద్ధరించుకుంటుంది; ప్రాణాహుతి తన కార్యాన్ని కొనసాగించడం వలన సాధన చేస్తున్న అభ్యాసుల హృదయాల్లో కూడా అదే పునరుద్ధరణ నిశ్శబ్దంగా, నిరంతరాయంగా జరుగుతుంది.

ఈ వసంత పంచమి రోజున, దీన్ని సుసాధ్యం చేసిన విశిష్ట వ్యక్తిత్వం, పూజ్యశ్రీ లాలాజీ మహరాజ్ పాదాల చెంత నేను ప్రణమిల్లుతాను. అలాగే ఎన్నటికీ మూయబడని ఒక ద్వారాన్ని తన ప్రేమతో తెరచిన పూజ్యశ్రీ బాబూజీ మహరాజ్ పాదాల చెంత కూడా వినమ్రతతో నమస్కరిస్తున్నాను.

ఈ పవిత్రమైన పిత్రార్జితానికి మనమే వారసులం; ఇది ఎంత గొప్ప పరంపర! ఎంత గొప్ప సంపద మన చేతుల్లో ఉంచబడింది! ఇప్పుడు ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఈ వారసత్వంతో మనమేం చేయబోతున్నాం?

ఈ సందర్భానికి తగినవిధంగా మనం ఎదుగుదాం. మన ఆధ్యాత్మిక పితృదేవులు సంతోషించేలా చేద్దాం. బ్రైటర్ వరల్డ్ నుంచి మనలో ఐకమత్యాన్ని, పరస్పర ప్రేమను, గౌరవాన్ని చూసి, వారు దేనికోసమైతే జీవించారో అలాంటి జీవనాన్ని మనమూ గడపడం చూసి, వారు ఆనందంతో నృత్యం చేసేలా మనం చేద్దాం.

ఈ వంశ పారంపర్య వారసత్వ సంపదను కాపాడటం, వృద్ధి చేయడం అంటే వారి ప్రమాణాలకు అనుగుణంగా మన ఆలోచన, ప్రవర్తన, కార్యాచరణలు ఉండాలి. ఈ మార్గాన్ని స్పృశించిన ప్రతి ఒక్క కుటుంబంలో సామరస్యత నెలకొనుగాక! అభ్యాసులు కలిసి సాధన చేసే ప్రతి ధ్యాన కేంద్రమూ సామరస్యంతో విరాజిల్లు గాక! ఆధ్యాత్మిక సంఘాలలో కొన్నిసార్లు చొరబడే చిన్న చిన్న విభజనలు ఈ వసంతకాల సూర్యుని వెచ్చదనంలో కరిగిపోవు గాక! మనమంతా ఒకే పరంపరకు చెందిన సంతానమనీ, ఒకే ప్రాణాహుతిని గ్రహించేవారమనీ, ఒకే గమ్యం వైపు ప్రయాణిస్తున్నామనీ గుర్తుంచుకొనెదము గాక!



**ఈ సందర్భానికి తగినవిధంగా మనం ఎదుగుదాం. మన ఆధ్యాత్మిక పితృదేవులు సంతోషించేలా చేద్దాం. బ్రైటర్ వరల్డ్ నుంచి మనలో ఐకమత్యాన్ని, పరస్పర ప్రేమను, గౌరవాన్ని చూసి, వారు దేనికోసమైతే జీవించారో అలాంటి జీవనాన్ని మనమూ గడపడం చూసి, వారు ఆనందంతో నృత్యం చేసేలా మనం చేద్దాం.**

లాలాజీ, తన శిష్యుడు వర్ధిల్లడంలోని ఆనందం కోసం తన అద్భుత ఆవిష్కరణను వదులుకోగలిగినప్పుడు, బాబూజీ, రాధ యొక్క ప్రేమ సైతం చిన్నబోయేలా ప్రేమించగలిగినప్పుడు, మనం కూడా తోటి సోదరీసోదరులకు మన స్నేహ హస్తాన్ని కచ్చితంగా అందించగలం. చిన్నచిన్న అపార్థాలను వదిలివేసి మనలో నింపబడే దానికి అర్హమైన పాత్రలుగా మనల్ని మనం తీర్చిదిద్దుకుందాం.

కనుక, మన మాస్టర్ ల ప్రేమ, మీ హృదయాన్ని స్పృశించు గాక! ప్రాణాహుతి మీ అస్తిత్వాన్ని పరివర్తింపజేయు గాక! మీరు కూడా మీమీ పరిధులలో వారి వారసత్వానికి ఒక సజీవ సాక్ష్యంగా తయారవుదురు గాక!

ప్రేమతో, ప్రార్థనలతో
**కమలేష్**

వసంత పంచమి, జనవరి 23, 2026

పూజ్యశ్రీ లాలాజీ మహరాజ్
153వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఇచ్చిన సందేశం
22, 23 & 24, జనవరి 2026, కాన్హా శాంతి వనం



## దాజీతో మాస్టర్ క్లాసులు

హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానాన్ని మీరెప్పుడైనా ప్రారంభించవచ్చు. మూడు భాగాల మాస్టర్ క్లాసుల కోసం దాజీతో కలవండి. వాటిలో వారు హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతి యొక్క ప్రయోజనాలను చెబుతారు. మీ దైనందిన జీవితానికి హార్ట్‌ఫుల్‌నెస్ రిలాక్సేషన్, ధ్యానం, నిర్మలీకరణ, ప్రార్థనలను ఎలా జోడించవచ్చో వారు వివరిస్తారు. మాస్టర్ క్లాసులన్నీ ఉచితమే.

https://heartfulness.org/global/masterclass/

## హార్ట్‌ఫుల్‌నెస్ సాధనా పద్ధతులు

హార్ట్‌ఫుల్‌నెస్ సాధనా పద్ధతులను కనుగొనండి. రిలాక్స్ అవడం, ధ్యానం చేయడం, నిర్మలీకరణ చేయడం, ప్రార్థన చేయడం నేర్చుకోండి.

https://heartfulness.org/in-en/heartfulness-practices/

heartfulness
purity weaves destiny

